సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 11 । ఏప్రిల్ । 2025



టన్ను చీనీ రూ.23,100

అనంతపురం మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.23,100, కనిష్టంగా రూ.4,150 ప్రకారం ధర పలికాయి.



వైభవం.. పోతురాజు మహోత్సవం

గుడిబండలో తుమ్మల మారెమ్మదేవి ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం పోతురాజు మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.

8లో

గరిష్టం/కనిష్టం
39.5°/21.4°

జిల్లా పరిధిలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం కొనసాగుతోంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 8 నుంచి 10 కి.మీ వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

వైద్యశాఖలో కోల్డ్‌వార్

• ఓ అసిస్టెంట్‌కు.. మెడికల్ ఆఫీసర్లకు తగాదా • కలెక్టర్, హెల్త్ కమిషనర్ వద్దకు చేరిన పంచాయితీ • అసిస్టెంట్‌ను తీసేయాలని మంత్రి సత్యకుమార్‌కు మెడికల్ ఆఫీసర్ల వినతి

ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన వైద్యశాఖలో సిబ్బంది మధ్య అనారోగ్య వాతావరణం ఏర్పడింది. కొరవడిన సమన్వయంతో ఉద్యోగుల మధ్య కోల్డ్‌వార్ సాగుతోంది. ఆఖరికి వీరి పంచాయితీ బెజవాడ వరకూ వెళ్లింది. తప్పు వారిదేనని ఒకరు.. కాదు ఆయనదేనని వారందరూ వాదిస్తున్నారు.





పుట్టపర్తిలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం

సాక్షి, పుట్టపర్తి: జిల్లాలో వైద్యారోగ్యశాఖ పరువు బజారు పడుతోంది. జిల్లా అధికారిని ఓవర్‌టేక్ చేస్తూ వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది మంత్రిని కలవడం, డీహెచ్‌కు మెయిల్ ద్వారా సమాచారం చేరవేయడం, హెల్త్ కమిషనర్ వద్ద పంచాయితీ పెట్టడం గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోయాయి. అయితే పంచాయితీ ఎలాంటి ఫలితం ఇవ్వకపోవడంతో అధికారులు – సిబ్బంది మధ్య అనారోగ్యకర పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఫలితంగా వైద్య ఆరోగ్యశాఖ పంచాయితీ గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ అందరి నోటా చర్చకు దారి తీసింది. వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారి దృష్టికి తీసుకెళ్లకుండా.. మెయిల్స్ ద్వారా విజయవాడకు సమాచారం చేరవేయడం కలకలం రేపింది. ఫలితంగా వైద్య – ఆరోగ్య శాఖలో పలు లోపాలు బహిర్గతం అయ్యాయి.

గొడవకు కారణం ఇదేనా?

కర్ణాటక సరిహద్దున ఉన్న కొన్ని పీహెచ్‌సీల్లో పని చేసే మెడికల్ ఆఫీసర్లు ప్రైవేటు క్లినిక్‌లు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఎఫ్‌ఆర్‌ఎస్ (ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్) పలు లొకేషన్ల నుంచి వేయడం సమస్యగా మారి కోల్డ్‌వార్‌కు దారి తీసింది. నిబంధనల ప్రకారం పనిచేసే చోట నుంచే బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాల్సి ఉంది. దీని వల్ల వారు పనిచేస్తున్న ప్రాంతంతో పాటు ఎన్నిగంటలకు విధులకు వస్తున్నారో కూడా సులువుగా తెలిసిపోతుంది. ఈ నేపథ్యంలోనే పీహెచ్‌సీ పరిధి నుంచి ఎఫ్‌ఆర్‌ఎస్ ఉంటేనే అప్రూవ్ చేస్తానని జిల్లా కేంద్రంలో ఉండే సీనియర్ అసిస్టెంట్ వాదించడాన్ని మెడికల్ ఆఫీసర్లు తప్పుబడుతున్నారు. సీనియర్ అసిస్టెంట్ స్థాయి మరచి మాట్లాడుతున్నారని మాటల యుద్ధం మొదలుపెట్టారు. ఆ తర్వాత పదే పదే సమస్య ఉత్పన్నం కావడంతో రెండు నెలల క్రితం ఎఫ్‌ఆర్‌ఎస్ విధుల నుంచి సదరు సీనియర్ అసిస్టెంట్‌ను తప్పించారు. అయితే ఆ సీనియర్ అసిస్టెంట్‌ను జిల్లా నుంచి బదిలీ చేయించాలని కొత్తగా యూనియన్ ఏర్పాటు చేసిన సభ్యులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

గుర్తింపు లేని యూనియన్‌తో..

ఉద్యోగ సంఘాలు చాలానే ఉన్నాయి. అయితే ఎలాంటి గుర్తింపు లేని ఓ యూనియన్‌ను ఏర్పాటు చేసుకుని.. తాము సిబ్బంది తరఫున పోరాటం చేస్తున్నామని ఆ యూనియన్ సభ్యులు చెబుతున్నారు. సీనియర్ అసిస్టెంట్ వ్యవహార శైలి బాగా లేదని అంటున్నారు. ఆరు పీహెచ్‌సీల్లో ఏర్పడిన సమస్యపై ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు లీడ్ తీసుకుని.. సదరు సీనియర్ అసిస్టెంట్‌ను బదిలీ చేయించాలని కంకణం కట్టుకున్నారు. ఇందులో భాగంగా ఆ సీనియర్ అసిస్టెంట్ కదలికలపై దృష్టి సారించి.. ప్రతి చిన్న విషయాన్నీ భూతద్దంలో చూపిస్తూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. వ్యక్తిగత కక్షలతో వాట్సాప్ స్టేటస్‌లోని విషయాలను కూడా ఫిర్యాదులో పేర్కొనడం విశేషం.

ప్రభుత్వ జీతం.. ప్రైవేటు వైద్యం..

మెడికల్ ఆఫీసర్లకు మర్యాద ఇవ్వకుండా మాట్లాడే.. సీనియర్ అసిస్టెంట్‌ను తక్షణమే బదిలీ చేయాలంటూ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటివరకు గుర్తింపు పొందని ఓ యూనియన్ తరఫున పోరాటం మొదలుపెట్టారు. వివరాలపై ఆరా తీస్తే ఆ మెడికల్ ఆఫీసర్లు అందరూ ప్రైవేటు క్లినిక్‌లకే పరిమితం అవుతున్నట్లు తెలిసింది. హిందూపురం కేంద్రంగా ప్రైవేటు వైద్య వ్యాపారం మొదలుపెట్టి.. పీహెచ్‌సీలకు దుమ్మా కొడుతున్నట్లు తేలింది. ఈ క్రమంలో తమ అనధికారిక డ్యూటీలను బయటపెట్టిన సీనియర్ అసిస్టెంట్‌ను తీసేయాలని పట్టుబట్టినట్లు సమాచారం.

సక్రమంగా పనిచేసినా తప్పేనా?

నేను వాట్సాప్‌లో నాకు ఇష్టం వచ్చినట్లు స్టేటస్ పెట్టుకుంటా. ఆ మాత్రం స్వేచ్ఛ లేదా? సమాజానికి ఇబ్బంది కలిగేలా నేనెప్పుడూ ప్రవర్తించ లేదు. డ్యూటీలో భాగంగా నేను చేయాల్సిన పని చేస్తున్నా. పీహెచ్‌సీలలో ఎఫ్‌ఆర్‌ఎస్‌లు మాత్రమే అనుమతించాలనే నిబంధన ఉంది. ఆ మేరకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఎఫ్‌ఆర్‌ఎస్‌లను తిరస్కరించా. ఉన్నతాధికారుల సూచన మేరకు నా డ్యూటీ నేను చేస్తున్నాను. అవతలి వాళ్ల తప్పిదాలను కప్పిపెట్టాల్సిన అవసరం నాకు లేదు. నన్ను వ్యక్తిగతంగా టార్గెట్ చేసి ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు. ఉన్నతాధికారులు విచారణ చేయిస్తే తప్పొప్పులు తేలతాయి. – **సీనియర్ అసిస్టెంట్, పుట్టపర్తి**

విచారణ చేస్తున్నాం

మెడికల్ ఆఫీసర్లు, సీనియర్ అసిస్టెంట్ మధ్య ఉన్న సమస్య నా దృష్టికి వచ్చింది. వెంటనే ఎఫ్‌ఆర్‌ఎస్ బాధ్యతల నుంచి సీనియర్ అసిస్టెంట్‌ను తప్పించి.. ఆ పనులను వేరొకరికి అప్పగించాము. కమిషనర్‌కు మెయిల్స్ ద్వారా పంపించిన విషయంపై విచారణ చేస్తున్నాం. ఎవరు పంపించారనే విషయం తేలలేదు. అవన్నీ తప్పుడు ఫిర్యాదులు, ఫేక్ మెయిల్స్‌గా అనుమానం ఉంది. మెడికల్ ఆఫీసర్లు పీహెచ్‌సీల నుంచి ఎఫ్‌ఆర్‌ఎస్ ఉంటేనే పరిగణనలోకి తీసుకుంటాం. పని వేళల్లో కచ్చితంగా పీహెచ్‌సీల్లో ఉండాలి. లేదంటే అధికారికంగా సెలవులో ఉండాలి. డ్యూటీకి దుమ్మా కొట్టే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాం. ఎవరినీ ఉపేక్షించేది లేదు. – **ఫైరోజాబేగం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి**

న్యూస్‌రీల్

నిలకడగా చింతపండు ధర



మార్కెట్‌లో విక్రయానికి వచ్చిన చింత పండు

హిందూపురం అర్బన్: చింతపండు ధర మార్కెట్‌లో నిలకడగా కొనసాగుతోంది. గురువారం హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు 1,000 క్వింటాళ్ల చింత పండు రాగా, అధికారులు ఈ–నామ్ పద్ధతిలో వేలంపాట నిర్వహించారు. ఇందులో కరిపులి రకం క్వింటా గరిష్టంగా రూ.25 వేలు, కనిష్టంగా రూ.8 వేలు, సరాసరిన రూ.14 వేలు పలికింది. ఇక ఫ్లవర్ రకం చింతపండు క్వింటా గరిష్టంగా రూ.14,500, కనిష్టంగా రూ.4,300, సరాసరిన రూ.7 వేల ప్రకారం ధర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జి. చంద్రమౌళి తెలిపారు.

అంధుల స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి పంచాయతీ పరిధిలోని సేవామందిరంలో ఉన్న ప్రభుత్వ బాల బాలికల అంధుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యాసంవత్సరానికి గానూ పాఠశాలలో 1 నుంచి 10వ తరగతి వరకూ ప్రవేశం కోసం అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అన్ని తరగతులకు పాఠశాలలో 150 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఇందులో ప్రస్తుతం 58 మంది విద్యార్థులు ఉండగా మిగిలిన 98 ఖాళీలను నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తామన్నారు. 6 సంవత్సరాల నుంచి 14 సంవత్సరాల వయసున్న విద్యార్థులంతా ఆయా తరగతుల్లోకి అర్హత ఆధారంగా ప్రవేశానికి అర్హులన్నారు. ముఖ్యంగా 40 శాతం అంధత్వం కలిగి వైద్యులచే ధ్రువీకరించబడిన సర్టిఫికెట్ పొందిన వారు మాత్రమే ప్రవేశానికి అర్హులని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు 80088 89815, 81434 61585, 94900 71392, 94907 37661, 80081 71524 సెల్ ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సవిత

గోరంట్ల: స్థానిక నాల్గవ వార్డులోని సచివాయంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని గురువారం బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ప్రారంభించారు. మహిళలు కుట్టు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకు ముందు గోరంట్లలోని చౌడేశ్వరీ కాలనీలో ప్రజల దాహార్తిని తీర్చడం కోసం నూతన బోరుబావి తవ్వేందుకు రింగ్ ఏర్పాటు చేయగా మంత్రి సవిత అక్కడ పూజ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మారుతీప్రసాద్, ఎంపీడీఓ నరేంద్ర, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతే లక్ష్యం



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి సమత

నల్లచెరువు: పంచాయతీ అధికారులు పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా పంచాయతీ అధికారి సమత పేర్కొన్నారు. మండల పరిధిలో అల్లుగుండు, నల్లచెరువు పంచాయతీల్లోని చెత్త సంపద కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో తయారయ్యే వర్మీ కంపోస్టు, విడివిడిగా సేకరించిన పలు రకాల చెత్తలను పరిశీలించారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో తనకల్లు, నల్లచెరువు పంచాయతీ కార్యదర్శులతో పరిశుభ్రత– పారిశుధ్యంపై సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో పారిశుధ్య కార్మికులు ప్రతి ఇంటికీ వెళ్లి తడి పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. పంచాయతీ అధికారులు గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ అంజనప్ప, ఎంపీడీఓ రఘునాథ గుప్తా, ఈఓఆర్డీ శకుంతల, సర్పంచ్ పంచరత్నమ్మ, పంచాయతీ కార్యదర్శులు నరేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం డిపో ప్రారంభం



మద్యం డిపోను ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

గోరంట్ల: మండల పరిధిలోని పాలసముద్రం సమీపంలో ఆంధ్రప్రదేశ్ బెవరేజస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన మద్యం డిపో (ఐఎంఎఫ్ఎల్)ను గురువారం రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర.. బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితతో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, ప్రిన్సిపల్ సెక్రెటరీ ముఖేష్‌కుమార్ మీనా, రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ డైరెక్టర్ నిశాంత్‌కుమార్, రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలి



మాట్లాడుతున్న ఎల్‌డీఎం రమణకుమార్

పుట్టపర్తి అర్బన్: ప్రతి మహిళా కొంత సొమ్మును పొదుపు చేయడం ద్వారా ఆర్థికంగా ఎదగాలని ఎల్‌డీఎం రమణకుమార్ పేర్కొన్నారు. పుట్టపర్తి వెలుగు కార్యాలయంలో ఆదర్శ రూరల్ డెవలప్‌మెంట్ ట్రెనింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించే బ్యాంకులు అందించే సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సేవింగ్స్ ఖాతా, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రెకరింగ్ డిపాజిట్లు, కరెంట్ అకౌంట్లు , ఆడపిల్లల కోసం సుకన్య సమృద్ధి యోజన పథకం అందుబాటులో ఉందన్నారు. ప్రతి మహిళా కొంత సొమ్మును పొదుపు చేస్తే భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రసాద్, ఆదర్శ సంస్థ అధ్యక్షురాలు లక్ష్మీదేవి, కార్యదర్శి శివానంద, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మడకశిరలో దాహం.. దాహం



ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించిన బూదిపల్లి తండా వాసులు

- రోజూ ఏదో ఒక చోట నీటి కోసం రోడ్డెక్కుతున్న జనం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

గుడిబండ: మడకశిర నియోజకవర్గంలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోజూ ఏదో ఒక చోట రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ గుడిబండ మండల పరిధిలోని బూదిపల్లి తండా గ్రామ ప్రజలు గురువారం రాస్తారోకో చేపట్టారు. జంబులబండ పంచాయతీ బూదిపల్లి తండాలో సుమారు 28 కుటుంబాలు నివసిస్తున్నాయి. కొన్ని రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు ఖాళీ బిందెలతో మడకశిర – అమరాపురం రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. జంబులబండ పంచాయతీ కార్యదర్శి చక్రవర్తి సంఘటనా స్థలానికి చేరుకుని ప్రజలతో చర్చించారు. తాగునీటి సరఫరాకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఇదిలా ఉండగా నియోకవర్గ వ్యాప్తంగా ఎన్నో గ్రామాల్లో తాగునీటి సమస్య కోసం ప్రజలు రోడ్డెక్కుతున్నా సమస్యను పరిష్కరించడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

తల్లీ బిడ్డల క్షేమమే ముఖ్యం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ఫైరోజాబేగం

పుట్టపర్తి అర్బన్: గర్భిణులకు తల్లీ బిడ్డల సంరక్షణపై పూర్తి అవగాహన కల్పించి వారి పరిరక్షణకు తోడ్పాటు అందించాలని డీఎంహెచ్‌ఓ ఫైరోజా బేగం ఆదేశించారు. మాతా శిశు మరణాలకు సంబంధించి జిల్లా స్థాయి సబ్ కమిటీ మీటింగ్‌ను గురువారం స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ జిల్లాలో మార్చి నెలలో మూడు శిశు మరణాలు , ఒక మాతృ మరణం సంభవించాయన్నారు. ప్రతి నెలా జరిగే రివ్యూ ద్వారా సిబ్బంది అవగాహన పెంచుకోవాలని తద్వారా గర్భిణీలకు అవగాహన పెంచవచ్చన్నారు. గర్భిణులకు ప్రతి నెలా 9న జరిగే శిక్షణలో అవగాహన కల్పించాలని సూచించారు. గర్భిణుల గ్రూపును తయారు చేసి ఆరోగ్య విద్యను అందించాలన్నారు. ఏ తల్లీ .. బిడ్డకు జన్మనిస్తూ చనిపోకూడదని, ఏ బిడ్డ జన్మిస్తూ చనిపోరాదన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్రనాయక్, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు మంజువాణి, సెలియాసాల్మన్, నాగేంద్రనాయక్, వైద్యులు సునీల్, శ్రీలత, నీరజ, కార్తీక్, ఐసీడీఎస్ పీడీ శారద , డీపీహెచ్‌ఎన్‌ఓ వీరమ్మ, 108 ఈఓ అబ్దుల్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

మంగళమడకలో ఎస్పీ 'పల్లె నిద్ర'

ముదిగుబ్బ: మండల పరిధిలోని మంగళమడక గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో చేపట్టిన పల్లె నిద్ర కార్యక్రమానికి ఎస్పీ రత్న హాజరయ్యారు. ఈ సందర్భంగా 'నేర నియంత్రణ' అనే కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గ్రామాలు, వార్డుల్లో నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలు తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు.



పల్లె నిద్రలో పాల్గొన్న ఎస్పీ వి. రత్న

ఆస్పత్రిని పరిశీలించిన కాయకల్ప బృందం



ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ వార్డును పరిశీలిస్తున్న కాయకల్ప బృందం

హిందూపురం టౌన్: పట్టణంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిని కాయకల్ప బృందం గురువారం పరిశీలించింది. విజయవాడ నుంచి కాయకల్ప బృందం డాక్టర్లు రామారావు, నరేష్, క్వాలిటీ కంట్రోలర్ సుబ్రహ్మణ్యం పాల్గొని ఆస్పత్రిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. జాతీయ ఆరోగ్య మిషన్ ఏటా కాయకల్ప అవార్డు అందిస్తుంది. ఇంటర్నల్ అసెస్మెంట్‌లో భాగంగా బృందం సభ్యులు ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించి స్వచ్ఛత, సదుపాయాలు, బయోమెడికల్ వేస్టేజ్, ల్యాబ్, మందుల నిర్వహణ, పరిశుభ్రత, సిబ్బంది పనితీరు, బెడ్స్ నిర్వహణ, వార్డులో రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పలు అంశాలను మెరుగుపరుచుకవాలని బృందం సభ్యులు ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు సూచించారు.

వెబ్.. డబ్..

- హిందూపురం మండలానికి చెందిన ఒక వ్యక్తి చనిపోయాడు. అతని పేరు మీద ఉన్న 3 ఎకరాల భూమిని అతని భార్య తన పేరు మీద పట్టా పాసుపుస్తకాలు చేసుకోవానుకుంది. ఎన్నో ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోవడంతో ఆఖరికి దళారులను ఆశ్రయించి రూ.20 వేలు ఖర్చు పెట్టుకున్న తర్వాత పని జరిగింది.
- చిలమత్తూరు మండలం కోడూరు సమీపంలో చెందిన ఓ రియల్టర్ ఐదు ఎకరాలకుపైగా భూమిని కొనుగోలు చేశారు. అన్ని రికార్డులు కార్యాలయంలో సమర్పించినా వెబ్‌ల్యాండ్‌లో పేరు నమోదు కాలేదు. ఆరా తీస్తే .. కార్యాలయంలో సరైన సమాధానం లేదు. తరువాత కింది స్థాయి సిబ్బందిని దళారుల ద్వారా కలిస్తే రూ.30 వేలు దళారుల అనుచరుల ఖాతాల్లోకి డిజిటల్ చెల్లింపు జరగడంతో ఆ రాత్రికే రికార్డుల్లోకి ఎక్కించేశారు. పైసలిస్తేనే తహసీల్దార్ డిజిటల్ సైన్ ఆమోద ముద్ర పడుతోందన్న విమర్శలున్నాయి.

- మ్యుటేషన్ల కోసం బాధితుల తిప్పలు
- దళారులతో రెవెన్యూ సిబ్బంది కుమ్మక్కు !
- అందినకాడికి దోచుకుంటున్న వైనం



హిందూపురం అర్బన్: ప్రస్తుతం భూ క్రయ విక్రయాలకు సంబంధించి వెబ్‌ల్యాండ్ కీలకంగా మారింది. ఆన్‌లైన్‌లో రైతు పేరు నమోదై ఉంటే చాలు రిజిస్ట్రేషన్ జరిగిపోతుంది. పట్టా దారు పాసుపుస్తకాలు, దస్తా వేజులతో పనిలేదు. అయితే కొందరు అధికారులు వెబ్‌ల్యాండ్ అవినీతికి కేరాఫ్‌గా మార్చేసి అందినకాడికి దోచుకుంటున్నారు. మూడు నెలల క్రితం చిలమత్తూరు మండలంలో ఓ రైతుకు చెందిన 3 ఎకరాల భూమి మరొకరి పేరున, అలాగే చాగలూరు పొలంలో 20 ఎకరాలకుపైగా పట్టా భూమి వారసులు స్థానికంగా లేకపోవడంతో వారి భూమి వేరొకరి పేరున ఎలాంటి ఆధారాలు లేకుండా వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేశారు. చిలమత్తూరుకు చెందిన ఓ వ్యక్తికి చెందిన 20, 15, 15 సెంట్ల స్థలం వివిధ సర్వే నంబర్లలో ఉంది. ఈ భూముల వివాదం కోర్టులో ఉండగానే నిబంధనలు అతిక్రమించి రికార్డుల్లోకి ఎక్కించారు. చివరకు బాధితుడు ఆర్డీఓను కలిసి అర్జీ ఇచ్చినా ఇప్పటి వరకూ అతనికి న్యాయం జరగలేదు. అధికారులకు కోర్టుల్లో ఉన్న భూములను సైతం భయం లేకుండా మార్చేస్తున్నారు.

చేయి తడిపితేనే పని..

హిందూపురం ఎమ్మెల్యే బాలయ్య ఇలాఖాలో గ్రామీణ ప్రాంత ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. పైసలిస్తేగాని ఏ పని జరగడం లేదు. పైసలు ఇవ్వకపోతే పట్టాదారు పాసుపుస్తకాలకు సిబ్బంది సవాలక్ష కొర్రీలు వేస్తున్నారన్న విమర్శలున్నాయి. అదే సొమ్ము పెడితే చక చకా పనులు జరిగిపోతున్నాయని వాపోతున్నారు. వెబ్‌ల్యాండ్ హిందూపురం నియోజకవర్గంలో డబ్బుల్యాండ్‌గా మారిందంటున్నారు. లేపాక్షి మండలం కొండూరు సమీపంలో ఓ కంపెనీ ప్రతినిధులు దళితులకు చెందిన అసైన్డ్ భూమిని అధికారులతో లోపాయికారి ఒప్పందం చేసుకొని తమ పరం చేసుకున్నారు. ఇప్పుడు ఆ భూములపై పోరాటాలు చేస్తున్నా.. కోర్టులకు ఎక్కినా ఆ భూములపై అధికారులు నోరు మెదపడం లేదు.

పెరిగిన భూముల రేట్లు..

వారసత్వం, కొనుగోలు చేసిన ఆస్తి పంపకాల ద్వారా సక్రమించిన ఆస్తిని తమ పేరున మార్చుకొని పాసుపుస్తకాలు పొందేందుకు రైతులు రూ.లక్షలు ఇచ్చుకోవాల్సి వస్తోంది. కూటమి పాలనలో రెవెన్యూశాఖలో అవినీతి పరాకాష్టకు చేరుకుంది. హిందూపురం పారిశ్రామికవాడ, చిలమత్తూరు మండలాల్లో భూముల విలువలు పెరగడంతో అధికారులు కూడా అవినీతికి గేట్లు తీశారంటున్నారు. డబ్బులు ఇవ్వందే పనులు చేయడంలేదని బాధితులు వాపోతున్నారు.

డిజిటల్ సైన్‌తోనే..

ఫైళ్లు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతి తహసీల్దార్‌కు డిజిటల్ సైన్ ఇచ్చింది. దీన్ని చాలా గోప్యంగా ఉంచాలి. కానీ చాలా మంది తహసీల్దార్లు కార్యాలయంలోని నమ్మకమైన ఉద్యోగులు, లేదా తమకు అనుకూలంగా ఉండే కంప్యూటర్ ఆపరేటర్ల వద్ద ఉంచుతున్నారు. దీంతో ఒక్కోసారి తహసీల్దార్లకు తెలియకుండానే సదరు వ్యక్తులు తహసీల్దార్ డిజిటల్ సైన్ చేసి ఫైళ్లకు పచ్చజెండా ఊపుతున్నారు.

భూములపై అధికార పార్టీ నాయకుల కన్ను

తహసీల్దార్ కార్యాలయాల్లోని కొందరు కంప్యూటర్ ఆపరేటర్లు, సిబ్బంది దళారులతో కుమ్మక్కయి అక్రమాలకు పాల్పడుతున్నారు. హిందూపురం, చిలమత్తూరు మండలాల్లో డబ్బులిస్తే పనులు జరిగిపోతున్నాయి. దీన్నే అలుసుగా తీసుకున్న కొందరు అధికార పార్టీ నాయకులు తమకు అధికారులను అనుకూలంగా మలుచుకొని తమవిగాని భూములను తమకు అనుకూలంగా ఉన్న వారి పేరుపై మార్చేసు కొంటున్నారు. ఎక్కడైనా వివాదం చెలరేగితే .. కొన్నాళ్లు మిన్నకుండి మళ్లీ తమ పని కానిస్తున్నారు. దీంతో ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రజుమానికి ఈ ప్రాంత రైతులు క్యూ కడుతున్నారు. కలెక్టర్ స్పందించి అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సి ఉంది.

క్లుప్తంగా

మోతుకపల్లిలో టీడీపీ నేత దౌర్జన్యం

చిలమత్తూరు: హిందూపురం పట్టణ పరిధిలోని మోతుకపల్లిలో టీడీపీ నేత చంద్రమోహన్ దౌర్జన్యాలకు అంతు లేకుండా పోతోంది. ఏకంగా రోడ్డును ఆక్రమించి ప్రహరీ నిర్మించిన అడ్డుకునే అధికారి లేకపోయాడు. తమ ఇంటికి వెళ్లేందుకు దారి లేకుండా రోడ్డును చంద్రమోహన్ ఆక్రమించాడంటూ మున్సిపల్ అధికారులకు అదే గ్రామానికి చెందిన గొల్ల పవన్‌కుమార్ ఫిర్యాదు చేయడంతో టీడీపీ నేత కబ్జా పర్వం బయట పడింది. దీంతో అప్పటి వరకూ కబ్జాపై ఉదాసీనంగా వ్యవహరిస్తూ వచ్చిన అధికారుల్లో చలనం మొదలై ఈ నెల 3న క్షేత్ర స్థాయిలో పరిశీలించి, ఆక్రమణ నిజమని నిర్ధారించుకుని సదరు టీడీపీ నేతకు నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లోపు తొలగించాలని ఆదేశించినా టీడీపీ నేత లెక్క చేయకుండా ప్రహరీని అలాగే ఉంచాడు. ప్రహరీని కూల్చరాదంటూ అధికారులపై ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ ఒత్తిడి తీసుకెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో మళ్లీ అధికారులు మిన్నకుండిపోయారు.

రాగి పంట పరిశీలన



రాగి పంటను పరిశీలిస్తున్న అధికారులు

చిలమత్తూరు/లేపాక్షి: మండలంలోని టేకులోడు, లేపాక్షి మండలం కల్లూరు గ్రామాల్లో రైతులు సాగు చేసిన రాగి పంటను ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ (ఏపీఎస్ఓపీసీఏ) ఎవాల్యూటర్ బి.వెంకటేష్ గురువారం పరిశీలించారు. ఐఎన్‌డీజీఏపీ సర్టిఫికేషన్ కోసం కంబాలరాయుడు పరస్పర సహాయక సహకార సంఘం లిమిటెడ్ ద్వారా నమోదు చేసుకున్న హిందూపురం డివిజన్‌కు సంబంధించి 20 మందికి అవగాహన కల్పించారు. రసాయన ఎరువులు, పురుగు మందులను సిఫార్సు మేరకు మాత్రమే వాడాలని రైతులకు సూచించారు. విత్తన ధ్రువీకరణ ప్రాముఖ్యతను వివరించారు. పురుగు మందుల అవశేషాల పరీక్ష నిమిత్తం రాగి విత్తన నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపారు. కార్యక్రమంలో సీఈఓ హరి, ఏఓ శ్రీలత, వంశీకృష్ణ, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై శ్రీవారు



తాడిపత్రి: ఆలూరు కోనలో వెలసిన శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 5 వ రోజు గురువారం దేవేరులతో కలసి గరుడవాహనంపై భక్తులకు శ్రీరంగనాథుడు దర్శనమిచ్చారు. ఉదయం మూలవిరాట్‌కు అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. రాత్రి గరుడ వాహన సేవను అంగరంగ వైభవంగా నిర్వహించారు.

కలలు కన్నారు.. సాకారం చేసుకున్నారు

'కలలు కనండి..ఆ కలలను సాకారం చేసుకోండి' అంటూ యువతలో చైతన్యాన్ని రగిలించిన మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా, దివంగత రాష్ట్రపతి, భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తి వృథా కాలేదు. నిరుపేద కుటుంబంలో పుట్టి పెరిగి... తాము కన్న కలలను సాకారం చేసుకున్నారు ఇద్దరు యువ సోదరులు. తమ తల్లిదండ్రుల ఆశయాన్ని నెరవేర్చారు. ప్రతిభకు ఎల్లలు లేవు.. కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని నిరూపించారు. మారుమూల వెనుకబడిన గ్రామీణ ప్రాంతంలోని పేద కుటుంబంలో పుట్టి... జాతీయ స్థాయి సంస్థలో ప్రతిష్టాత్మక ఉద్యోగాలను సాధించారు.



ఇస్రో శాస్త్రవేత్తగా ఎంపికైన పూజారి నాగప్రదీప్



ఓఎన్‌జీసీలో ఉద్యోగం పొందిన పూజారి నాగసాయి



- ఇస్రో శాస్త్రవేత్తగా ఎదిగిన ఆటో డ్రైవర్ కుమారుడు
- జాతీయ స్థాయి సంస్థలో మరో కుమారుడికి ఉద్యోగం



కుమారులు నాగ ప్రదీప్, నాగసాయిలతో ఆటో డ్రైవర్ నాగభూషణ, అతని భార్య (మధ్యలో)

కనగానపల్లి: మండల కేంద్రానికి చెందిన పూజారి నాగభూషణ ఓ సాధారణ వ్యవసాయ కూలీ. వ్యవసాయ పనులు ఉంటే పూట గడుస్తుంది. ఈ క్రమంలో గ్రామంలో వ్యవసాయ పనులు సరిగా లేకపోవడంతో ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తన కష్టం పిల్లలకు రాకూడదని భావించిన ఆయన... కేవలం చదువులు ఒక్కటే వారి జీవన గమనాన్ని మారుస్తాయని గుర్తించాడు. ఆ దిశగా పిల్లల చదువు కోసం అహర్నిశం శ్రమించాడు.

తండ్రి ఆశయానికి అనుగుణంగా..

పూజారి నాగభూషణకు నాగప్రదీప్, నాగసాయి అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. ఓ వైపు ఆటో నడుపుతూనే రోజూ సమీపంలో ఉన్న ధర్మవరం పట్టణానికి పిల్లలను తీసుకెళ్లి ఓ ప్రైవేట్ పాఠశాలలో వదిలి వచ్చేవాడు. తిరిగి పాఠశాల వేళలు ముగిసే వరకూ ఆటో నడుపుతూ వచ్చే ఆదాయంలో మొదట పిల్లల చదువులకు కొంత మొత్తాన్ని పక్కన తీసిపెట్టేవాడు. తండ్రి ఆశయాన్ని గుర్తించిన పిల్లలు సైతం చదువులపై ఆసక్తి పెంచుకున్నారు. పేదరికపు సవాళ్లను అధిగమిస్తూ ఈ పదో తరగతి, ఇంటర్‌లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. ఆ తర్వాత ప్రభుత్వ, దాతల సహకారంతో బీటెక్ పూర్తి చేశారు. అనంతరం నాగప్రదీప్ బెంగుళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ యూనివర్సిటీలో ఎంటెక్ పూర్తి చేశాడు. ఆ సమయంలో సైన్స్ పరిశోధనల్లో ప్రతిభ చూపటంతో ప్రొఫెసర్ల ప్రోత్సాహంతో జాతీయ స్థాయిలో నిర్వహించిన బోర్డు పరీక్షలు రాసి ఆల్ ఇండియా స్థాయిలో 72వ ర్యాంకు సాధించాడు. దీంతో ఇస్రోలో శాస్త్రవేత్తగా పనిచేసే అవకాశం దక్కింది. ప్రస్తుతం ఆయన శ్రీహరికోటలోని ఇస్రోలో గ్రూపు- ఏ గెజిటెడ్ ఆఫీసర్ ఉద్యోగానికి అర్హత సాధించాడు.

జాతీయ స్థాయిలో మెరిసిన మరొకరు..

నాగప్రదీప్‌తో పాటు గేట్‌లో మంచి ర్యాంకు సాధించిన సోదరుడు నాగసాయి కూడా జాతీయ స్థాయి ఓఎన్‌జీసీ సంస్థలో ఏఈఈ ఉద్యోగం సాధించాడు. బీటెక్ పూర్తి కాగానే చిరుప్రాయంలోనే ఈ ఉద్యోగం సాధించడం గమనార్హం. దీంతో తన ఆశయానికి అనుగుణంగా కుమారులిద్దరూ జాతీయ స్థాయి సంస్థల్లో మంచి ఉద్యోగాలు సాధించినందుకు ఆటో డ్రైవర్ నాగభూషణ ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. తల్లిదండ్రుల కష్టాన్ని వమ్ము చేయకుండా పిల్లలిద్దరూ బాగా చదువుకొని ఉన్నతస్థాయి ఉద్యోగాలు సాధించినందుకు వారిని గ్రామస్తులు అభినందించారు.

సంఘాలను బలోపేతం చేస్తాం



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నరసయ్య

తనకల్లు: మహిళా సంఘాలను బలోపేతం చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. స్థానిక చౌడేశ్వరీ మహిళా సమాఖ్య కార్యాలయంలో గురువారం రైతు ఉత్పత్తిదారుల ఎఫ్‌పీజీ లీడర్ల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ... చిరుధాన్యాల సాగును ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. వేరుశనగ పంటకు మార్కెట్ సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘం పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇందిరానగర్‌లోని కల్పన మహిళా సంఘం యాక్షన్ ప్లాన్ గురించి సభ్యులతో మాట్లాడారు. వివిధ రకాల జీవనోపాధులకు అవకాశం ఉండేలా యాక్షన్ ప్లాన్‌ను తయారు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీహెచ్ఓ చంద్రశేఖర్, డీపీఎంఎల్‌హెచ్ రామమోహన్, ఏపీఓ మరియమ్మ, ఏపీఎం జయంతి, హెచ్ఓ లావణ్య, ఎఫ్‌పీఎం ఏపీఎం రమణప్ప, సీసీ, పలువురు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వాహనం ఢీ – బైక్ రైడర్ మృతి



మహేష్‌కుమార్ (ఫైల్)



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పెద్దవడుగూరు: వాహనం ఢీకొన్న ఘటనలో బెంగళూరు నగరానికి చెందిన ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... బెంగళూరులోని హెబ్బాల్‌లో వినాయక్‌నగర్ ఫోర్ట్రాస్‌లో నివాసముంటున్న మహేష్‌కుమార్ (47)కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఓ ప్రైవేట్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవారు. బైక్ రైడింగ్‌పై ఆసక్తి ఉన్న ఆయన వారం రోజుల క్రితం తన స్నేహితులతో కలసి ద్విచక్ర వాహనాలపై సిక్కింకు వెళ్లారు. ఈ క్రమంలో తిరుగు ప్రయాణమై ఈ నెల 9న హైదరాబాద్‌కు చేరుకున్నాడు. ఇదే విషయాన్ని కుటుంబసభ్యులకు ఫోన్ చేసి తెలిపారు. బుధవారం వేకువజామున హైదరాబాద్ నుంచి బెంగళూరుకు ఒంటరిగా ద్విచక్ర వాహనంపై బయలుదేరిన ఆయన గురువారం ఉదయం పెద్దవడుగూరు మండలం గుత్తి అనంతపురం గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ప్రయాణిస్తుండగా గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొనడంతో అదుపు తప్పి రోడ్డు పక్కన పడి అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పెద్దవడుగూరు పీఎస్ ఎస్ఐ ఆంజనేయులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద లభ్యమైన ఆధారాలను బట్టి కుటుంబసభ్యులకు ఫోన్ చేసి, సమాచారం అందజేశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఎస్ఐ సుధాకర్‌పై చర్యలు తీసుకోండి

- వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి



మడకశిర: పోలీసు శాఖ ప్రతిష్టను దిగజారుస్తూ రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతకు ఏజెంట్‌లా మారిన రామగిరి ఎస్ఐ సుధాకర్ యాదవ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి డిమాండ్ చేశారు. లేకపోతే పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతుందన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ఉద్యోగిగా మాజీ సీఎంను ఏకవచనంతో సంబోధించడాన్ని ఆయన ఆక్షేపించారు. ప్రజల సొమ్ముతో జీతాలు తీసుకుంటూ ఓ రాజకీయ పార్టీకి కొమ్ము కాయడం ఎస్ఐ సుధాకర్‌యాదవ్‌కు తగదన్నారు. గతంలో చంద్రబాబు, ఇతర టీడీపీ నాయకులు పోలీసులను ఏకవచనంతో దూషించిన రోజు ఎందుకు వారిని విమర్శించలేదని ప్రశ్నించారు. పరిటాల రవి కుటుంబీకులు చెప్పిన విధంగానే తాను పనిచేస్తానంటూ వృత్తి ధర్మాన్ని విస్మరించిన సుధాకర్ యాదవ్.. పోలీస్ ఉద్యోగానికి అనర్హుడని, తక్షణమే ఆయనపై క్రమశిక్షణా చర్యలు తీసుకుని శాఖ ప్రతిష్టను కాపాడాలని పోలీసు ఉన్నతాధికారులను కోరారు.

కాంట్రాక్టర్ బలవంతపు వసూళ్లు

- పంచాయతీ కార్యాలయం ఎదుట వ్యాపారుల ధర్నా



ధర్నా చేస్తున్న వ్యాపారులు

సోమందేపల్లి: గ్రామ పంచాయతీ పరిధిలో వారపు సంతకు సంబంధించి అధిక రుసుం వసూలు చేస్తున్న కాంట్రాక్టర్ వైఖరిని నిరసిస్తూ వ్యాపారులు గురువారం ధర్నా నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం ఎదుట చేపట్టిన ఈ ధర్నాలో పలువురు మాట్లాడుతూ.. గతంలో వారపు సంతలో దుకాణం నిర్వహణకు రూ.150 చెల్లిస్తుండగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సుంకం వసూలుదారులు ఏకంగా రూ.300 నుంచి రూ.400 చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. దీంతో రోజంతా తాము కష్టపడి సంపాదించిన సొమ్ము కాంట్రాక్టర్ల పాలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై ఇష్టారాజ్యంగా వసూళ్లకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఆదాయం సమకూరుతున్నా మార్కెట్‌లో కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. అధికారులు ఎంతకూ స్పందించక పోవడంతో వ్యాపారస్తులు అక్కడి నుంచి వెళ్లి పోయారు. విషయం తెలుసుకున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ.. నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమంగా వసూళ్లు చేయడాన్ని తప్పుబట్టారు. ఈ అంశంపై పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

లైన్‌మెన్‌పై దాడి

లేపాక్షి: విద్యుత్ బిల్లు చెల్లించాలన్న లైన్‌మెన్‌పై ఓ వినియోగదారుడు దాడికి తెగబడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. లేపాక్షి మండలం పులమతి పంచాయతీ పరిధిలోని ఎస్ఆర్ఎంయూ కాలనీకి చెందిన ఆసీఫ్, షాహీనా విద్యుత్ బిల్లు చెల్లించలేదు. గడువు మించి పోవడంతో విద్యుత్ కనెక్షన్‌ను కట్ చేశారు. గురువారం ఉదయం ఎప్పటి లాగానే విద్యుత్ బిల్లు చెల్లించాలని లైన్‌మెన్ శివారెడ్డి వెళ్లి అడిగాడు. దీంతో ఆగ్రహానికి గురైన హసీఫ్, షాహీనా లైన్‌మెన్‌పై కట్టెతో దాడి చేయడమే కాక, ఆయన ద్విచక్ర వాహనాన్ని కిందకు పడేసి పగుల గొట్టారు. అక్కడున్న కొందరు స్పందించి ఇరువురిని సర్దిచెప్పి పంపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

డ్రిప్పు పరికరాల చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

బత్తలపల్లి: మండలంలోని సంజీవపురం గ్రామానికి చెందిన రైతు అవినేని సూర్యనారాయణ దానిమ్మ తోటలో డ్రిప్పు పరికరాలను అపహరించుకెళుతున్న తలారి నాగరాజును అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపాడు. గురువారం ఆయన మాట్లాడుతూ.. బాధిత రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తన సిబ్బందితో నిఘా ఉంచామన్నారు. ఈదుల ముష్టూరుకు చెందిన తలారి నాగరాజు.. డ్రిప్పు వైరు కట్టలను ద్విచక్ర వాహనంలో ధర్మవరంలో విక్రయించడానికి తీసుకెళ్లుతుండగా వేల్పుమడుగు క్రాస్ వద్ద అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

గోకులం పాఠశాలను పరిశీలించిన డీఈఓ



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న డీఈఓ కృష్ణప్ప

పుట్టపర్తి: మండల కేంద్రంలోని గోకులం ప్రాథమిక పాఠశాలను డీఈఓ కృష్ణప్ప గురువారం తనిఖీ చేశారు. తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడారు. పాఠాలు బోధించారు. ఈ పాఠశాలను ఆదర్శ పాఠశాలగా మారుస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. పాఠశాలలో విద్యార్థులను చేర్పించేలా తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని ఉపాధ్యాయుడు పీవీ రమణారెడ్డి, పాఠశాల సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఖాదర్‌వలి, ప్రసాద్ పాల్గొన్నారు.

సరదాగా రైలు ఎక్కి.. కనిపించకుండా పోయారు



జస్వంత్



విజయ్‌కుమార్

ధర్మవరం అర్బన్: స్థానిక కొత్తపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థులు జస్వంత్, విజయ్‌కుమార్ గురువారం రైలు ఎక్కి వెళ్లిపోయారు. వారు తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. పోతుకుంట గ్రామానికి చెందిన మల్లికార్జున కుమారుడు జస్వంత్, అతని స్నేహితుడు విజయ్‌కుమార్ ఇద్దరు కొత్తపేట ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. ఇద్దరు ఉదయం రైల్వేస్టేషన్‌కు వెళ్లి సరదాగా రైలు ఎక్కారు. ఈ లోపు రైలు ముందుకు కదలడంతో కిందకు దిగలేకపోయారు. బాలురు ఆచూకీ తెలిసిన వారు 63058 00429, 93458 63219, 63029 67673కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

వైభవంగా పోతులరాజు మహోత్సవం



ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

గుడిబండ: మండల కేంద్రానికి కూతవేటు దూరంలో వెలసిన తుమ్మల మారెమ్మదేవి ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం పోతులరాజు పుష్పాలంకరణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత తుమ్మల మారెమ్మదేవి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేసి మహంకాళి రూపంలో అలంకరణ చేశారు. అనంతరం గ్రామ నడిబొడ్డును వెలసిన వీరభద్రస్వామి ఆలయం నుంచి పోతులరాజులు ప్రత్యేకంగా అలంకరించుకుని పురవీధుల గుండా నృత్యం చేస్తూ మారెమ్మదేవి ఆలయం వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం సమీపంలో పోతులరాజు పుష్పాలంకరణ మహోత్సవాన్ని నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలతో పాటు కర్ణాటక ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు జనసంద్రమయ్యాయి. భక్తులకు గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

కొడికొండ చెక్‌పోస్ట్‌లో చైన్‌స్నాచింగ్

చిలమత్తూరు: మండలంలోని కొడికొండ చెక్‌పోస్ట్‌లో ఓ మహిళ మెడలోని బంగారం గొలుసును దుండగులు అపహరించుకెళ్లారు. ఎస్ఐ మునీర్ అహమ్మద్ తెలిపిన మేరకు... గురువారం ఉదయం చెక్‌పోస్టులోని ఓ దుకాణం వద్దకు వెళ్లిన ఇద్దరు యువకులు కూల్‌డ్రింక్ కావాలని అడిగారు. ఆ సమయంలో దుకాణ నిర్వాహకురాలు ఫ్రిడ్జ్ నుంచి కూల్ డ్రింక్ బాటిళ్లు తీస్తుండగా ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కొని ఉడాయించారు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పెనుగాలులకు నేలకొరిగిన అరటి



పొలంలో విరిగిపడిన అరటి చెట్లను చూపుతున్న కౌలు రైతు ఎర్రిస్వామి

కూడేరు: మండలంలోని మరుట్ల-1వ కాలనీలో గురువారం పెనుగాలుల ధాటికి కౌలు రైతు బెస్త ఎర్రిస్వామి సాగు చేసిన అరటి చెట్లు విరిగిపడ్డాయి. కోత దశలో ఉన్న దాదాపు 1500 అరటి చెట్లు విరిగిపోవడంతో రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

రైతు పంట పండింది!

- ఎకరాకు 70 బస్తాల దిగుబడి!



సంజీవరెడ్డి



140 బస్తాలతో రైతు సంజీవరెడ్డి

గుమ్మఘట్ట: కరువు జిల్లాలో ఓ రైతు తనకున్న రెండు ఎకరాల్లో పంటల సాగు చేపట్టి అద్భుతాలను సృష్టించాడు. వివరాలు.. రాయదుర్గం మండలం బొమ్మక్కపల్లి గ్రామానికి చెందిన రైతు సంజీవరెడ్డిది సాధారణ మధ్య తరగతి కుటుంబం. తనకున్న రెండు ఎకరాల్లో పంటలు సాగు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ప్రకృతి వైపరీత్యాలు, కరువుల నేపథ్యంలో అందరు రైతుల మాదిరిగానే పంట నష్టాలను చవిచూస్తూ వచ్చాడు. ఈ క్రమంలో పంటల సాగుపై పూర్తి స్థాయి అవగాహన పెంచుకున్న ఆయన... గత ఏడాది డిసెంబర్‌లో మొక్కజొన్న పంట సాగు చేపట్టి మొత్తం రెండు ఎకరాల్లో 140 బస్తాల దిగుబడిని సాధించాడు. విషయం తెలియగానే చుట్టుపక్కల గ్రామాల్లోని రైతులు పెద్ద సంఖ్యలో రైతు వద్దకు చేరుకుని పంట సాగు విధానాలపై ఆరా తీశారు. సాధరణంగా ఎకరాకు 40 బస్తాల నుంచి 50 బస్తాల వరకు దిగుబడి వస్తుందని, అదే వేసవి సీజన్ పంట అయితే 35 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వస్తుందని పేర్కొన్నారు. ఇందుకు భిన్నంగా ఏకంగా ఎకరాకు 70 బస్తాల దిగుబడి ఎలా సాధ్యమైందంటూ ప్రశ్నించారు.

సేంద్రియ సాగుతో అద్భుతం..

పంట మార్పిడితో పాటు సేంద్రియ పద్ధతుల్లో పంట సాగు చేపట్టడమే తన ఈ విజయానికి కారణంగా రైతులకు సంజీవరెడ్డి వివరించాడు. .ఎకరా విస్తీర్ణంలో పెన్నా రకం మొక్కజొన్న విత్తు మొదలు పంట కోత పూర్తయ్యే వరకు రూ.35 వేలు ఖర్చయినట్లు తెలిపాడు. అంతే కాకుండా పంటకు పంటకు మధ్య నేలకు కాస్త విరామం ఇవ్వడం ద్వారా భూమి కోల్పోయిన సారం తిరిగి పుంజుకునేందుకు మార్గం ఏర్పడిందన్నారు. దీనికి తోడు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించడం ద్వారా అధిక దిగుబడి సాధ్యమైందన్నారు. స్థానికంగా క్వింటా రూ.2,310తో అమ్మితే రూ.1,94 లక్షలు రాగా, రెండు ఎకరాలకు పెట్టుబడి కింద రూ.70 వేలు పోను రూ.1,24 లక్షల నికర ఆదాయం సమకూరిందని వివరించారు.

వ్యక్తి దుర్మరణం

హిందూపురం: వాహనం ఢీకొన్న ఘటనలో ఓ మార్నింగ్ వాకర్ దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. హిందూపురం మండలం సంతేబిదనూరు గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ అశ్వత్థనారాయణ (48) గురువారం తెల్లవారుజామున బెంగళూరు రోడ్డులో వాకింగ్‌కు వెళ్లాడు. రోడ్డు పక్కగా నడుచుకుంటూ వెళుతున్న ఆయనను వెనుక నుంచి వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనంతో సహా ఉడాయించాడు. ఘటనపై కేసును రూరల్ పీఎస్ సీఐ ఆంజనేయులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కలెక్షన్ సెంటర్లను వినియోగించుకోండి

- ఇక్రిసాట్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ పూర్ణచంద్రరావు

శింగనమల: రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కేవీవై) నిధులతో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన కలెక్షన్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు ఇక్రిసాట్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ కె.పూర్ణచంద్రరావు పిలుపునిచ్చారు. శింగనమల మండలం వెస్ట్ నరసాపురం, శింగనమల గ్రామాల్లో దొనరామేశ్వర రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు నిర్మించిన కలెక్షన్ సెంటర్లను థర్డ్ పార్టీ వెరిఫికేషన్ కింద గురువారం ఆయన పరిశీలించారు. రైతు సంఘాల ప్రతినిధులతో మాట్లాడారు. ఎఫ్‌పీఓ గ్రూప్ పరిధిలోని గ్రామాలు, సభ్యుల వివరాలు, పండించే ఉద్యాన, వ్యవసాయ పంటలపై ఆరా తీశారు. పంట ఉత్పత్తులను గ్రేడింగ్ చేసుకుని ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసుకునేందుకు కలెక్షన్ సెంటర్లు దోహదపడతాయన్నారు. పంట కోత అనంతరం ఉత్పత్తులను మార్కెట్‌లో డిమాండ్ వచ్చే వరకూ నిల్వ చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రామచంద్ర, ఉద్యానాధికారి శైలజ, రైతు సేవా కేంద్రం సిబ్బంది ఉమాదేవి, అనూష, పవన్‌కుమార్, అమరేష్, రైతులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

గోరంట్ల: మండలంలోని బూదిలి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్ నాయక్ భార్య అనంతబాయి (49) చేసుకుంది. మార్నింగ్ స్కూల్ కావడంతో గురువారం ఉదయం విజయ్‌కుమార్ నాయక్ పాఠశాలకు వెళ్లిపోయారు. ఆ సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న అనంతబాయి యాసిడ్ తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన ఇరుగుపొరుగు వారి సమాచారం మేరకు బంధువులు వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.